## సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

బడంగ్‌పేట, జూన్ 1: మహేశ్వరం నియోజకవర్గం పరిధిలో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మాజీమంత్రి, ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రా రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఇంటి వద్దకే వెళ్లి ఇవ్వాలని ఆయా మండలాలు, కార్పొరేషన్ల, మున్సిపల్ నాయకులకు ఆమె ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు, మాజీ సర్పంచులు, బీఆర్ఎస్ పార్టీ మండల, కార్పొరేషన్, డివిజన్ల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పులిమామిడిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభం

కందుకూరు, జూన్ 1 : మండల పరిధిలోని పులిమామిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. పంచాయతీ కార్యదర్శి రాజుగౌడ్ ఆధ్వర్యంలో ముగ్గులు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేశ్, బుక్క పాండురంగారెడ్డి, బుక్క మహేందర్ రెడ్డి, మహేశ్, రమేష్, రవీందర్, శ్యామేల్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవండి



శిబిరంలో రక్తదానం చేస్తున్న యువకులు

మన్సూరాబాద్, జూన్ 1: రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితిలో చికిత్స పొందుతున్న ఎంతోమందికి ప్రాణదానం చేయవచ్చునని ప్రసిద్ధ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ జూకూరి చైతన్య రాజు తెలిపారు. నకిరేకల్ శాసనసభ్యుడులు వేముల వీరేశం జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మన్సూరాబాద్ ఓ హాస్పిటల్ లో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదాన శిబిరంలో సుమారు 100 యూనిట్ల రక్తాన్ని సేకరించి బ్లడ్ బ్యాంకుకు అందజేశారు.

### అక్రమాలకు అడ్డా..

# సరూర్‌నగర్ రైతు బజార్

- మితిమీరుతున్న దుకాణ నిర్వాహకులు ఆగడాలు
- వినియోగదారుల ఆగ్రహం



సరూర్‌నగర్ రైతు బజార్

ఆర్కే పురం, జూన్ 1: సరూర్‌నగర్ రైతు బజార్ అక్రమాలకు అడ్డాగా మారింది. ఎడాపెడా అధిక ధరలతో దోచేస్తుంటే, కొనుగోలుదారులు గగ్గోలు పెడుతున్నా మార్కెటింగ్ అధికారుల్లో స్పందన లేదు .



మార్కెట్లో ధరల పట్టిక

### అధిక ధరలు అమ్మిన వారిపై చర్యలు తీసుకుంటున్నాం

ఫిర్యాదులు పరిశీలించి, అధిక ధరలు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకుంటున్నాం. పద్ధతి మార్చుకోకపోతే దుకాణాల నుంచి తొలగిస్తున్నాం. ఎవరైనా బోర్డు ధరలకే అమ్మాలి.

– స్రవంతి, ఎస్టేట్ అధికారి

ఎస్టేట్ అధికారి ఎప్పుడొస్తారో, సిబ్బంది ఎక్కడ సేద తీరుతారో తెలియని పరిస్థితుల్లో దుకాణ నిర్వాహకులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా నిర్వాహకుల్లో మార్పు రావడంలేదని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రైతు బజార్ కు ఎస్టేట్ అధికారిణిగా స్రవంతి ఉన్నారు. ఈ రైతు బజార్‌కు ఎల్బీనగర్, హబ్సిగూడ, తార్నాక నుంచి వినియోగదారులు వస్తుంటారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల వరకు దుకాణాల వద్ద బోర్డులపై నిర్దేశించిన ధరలు రాయాలి. కానీ తాపీగా ధరల పట్టికను సూచించడమే కాకుండా కొన్ని దుకాణాల్లో బోర్డుపై ఉన్న ధరలకు వసూలు చేసే మొత్తానికి సంబంధం ఉండడం లేదని వినియోగదారు ఆరోపిస్తున్నారు. రైతుల కంటే ఎక్కువమంది వ్యాపారులే ఉండడంతో ధరలు ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. ఏ ఒక్కరు కూడా బోర్డుపై ఉన్న ధరలకు అమ్మడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారి స్పందించి బోర్డుపై ఉన్న ధరలకు అమ్మే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్యం



శిల్పారామంలో చిన్నారుల కూచిపూడి నృత్య భంగిమ.

రామంతాపూర్ ,జూన్ 1: ఉప్పల్ మినీ శిల్పారామం ఆదివారం శ్రీ దత్త సంగీత నృత్య కళాశాల గురువు దుర్గ భవాని శిష్య బృందం చే కూచిపూడి నృత్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. మహాగణపతిమ్, బ్రహ్మాంజలి, అదిగో అల్లదిగో, తిల్లాన, చేరి యశోదకు, కృష్ణ శబ్దం, హిందోళ తిల్లాన, చక్కని తల్లికి, గరుడగమనా, కృష్ణ కృష్ణ, కొలువైఉన్నడే, ఒకపరి కొకపరి, వచ్చెను అలమేలుమంగా, తరంగం,మొదలైన అంశాలను తపస్వి, కావ్య, సాన్విక, సిరి, చందన, లక్ష్మి సహస్ర, ఆరాధ్య సాయి కీర్తన, లక్ష్మి మేఘన, వల్లి తదితరులు ప్రదర్శించి ఆహుతులను మెప్పించారు.

## వర్షాకాలంలో ఇబ్బందుల కలుగకుండా చర్యలు



చిలుకానగర్ డివిజన్‌లోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ గీతా ప్రవీణ్

రామంతాపూర్, జూన్ 1: వర్షాకాలంలో ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు చేపడతామని కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ అనారు. ఆదివారం డివిజన్ పరిధిలోని శ్రీ రాఘవేంద్ర కాలనీలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు నిలువ కుండా కొత్త వాటర్ డ్రైన్‌లకు, సీసీ రోడ్లకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి. డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాధిక, వాటర్ వర్క్స్ ఏఈ సత్యనారాయణ, సిబ్బంది ఉపేందర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కేదార్, బీఆర్ఎస్ నాయకులు కొండల్ రెడ్డి జగన్, నారాయణరెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, బాలకృష్ణగౌడ్ ,బాలు, బంటి గౌడ్ ,శ్యామ్ ,అశోక్ చారి, కాలనీ అసోసియేషన్ సభ్యులు,కాలనీ మహిళలు పాల్గొన్నారు.





## ఆదిత్య నగర్ కాలనీ కార్యవర్గం ఎన్నిక



కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఆదిత్య నగర్ కాలనీ నూతన కార్యవర్గం

మన్సూరాబాద్, జూన్ 1: మన్సూరాబాద్ డివిజన్ పరిధి ఆదిత్య నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం కాలనీలో నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాలనీ అధ్యక్షుడిగా నర్రి లింగం కురుమ, ప్రధాన కార్యదర్శిగా వై. శివకుమార్, కోశాధికారిగా ఎస్.ఎస్. ప్రసాద్, ఉపాధ్యక్షులుగా బి. యాదయ్య, ఎన్.వి.ఆర్. నాగరాజు, సంయుక్త కార్యదర్శిగా ఎన్. నాదముని రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శులుగా ఎస్. ఒమన్ కుమార్, ఎస్. శ్రీధర్ రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా జీకే. గుప్తా, సలహాదారులుగా పి. కోదండరామ శర్మ, జేవీస్వీ ప్రసాద్, కార్యవర్గ సభ్యులుగా వీఎస్ఎన్. మూర్తి, జీవీ ప్రసన్నకుమార్, ఐ. కృష్ణమూర్తి, కె. అరుణమ్మ, ఆర్ రవీందర్ రెడ్డి, ఎస్. రాఘవ శర్మ, బి. లక్ష్మీనారాయణ, బి. శ్రీను, ఎన్. ప్రణీతరావు, ఎం. ఆదిత్య, డి. రోహిత్ శర్మ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మర్యాదపూర్వకంగా కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డిని కలుసుకొని కాలనీ సమస్యలను వివరించారు.

## బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ ప్రధాన కార్యదర్శిగా వినయ్‌కుమార్



వినయ్‌కుమార్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఆర్. కృష్ణయ్య

మన్సూరాబాద్, జూన్ 1: బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఎల్బీనగర్‌కు చెందిన మద్దెల వినయ్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ఉత్తర్వులను జారీ చేసి సదరు నియామక పత్రాన్ని ఆదివారం వినయ్ కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ, చట్టసభలలో బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాటం చేస్తామని తెలిపారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంజి, మోడీ, రాందేవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు పంపిణీ

కీసర, జూన్1: మండలంలోని తిమ్మాయిపల్లి, చీర్యాల్, కీసర, అంకిరెడ్డిపల్లి ఆయా పంచాయతీ కార్యాలయాల వద్ద ఆదివారం ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, బిల్ కలెక్టర్లు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు.కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు సంబంధించిన నేతలు తదితరులు పాల్గొన్నారు.



కీసరలో పట్టాలను లబ్ధిదారులకు అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి గంగన్న

## రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

- రేపటి నుంచి 21వ తేదీ వరకు



మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాల్

కందుకూరు, జూన్ 1 :రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ గోపాల్ కోరారు. మూడో తేదీ నుంచి 20వ తేదీ వరకు రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులను నిర్వహిస్తామని చెప్పారు. రెండు బృందాలు ఏర్పాటు చేశామని వివరించారు. ఒక బృందానికి తనతో పాటు సీనియర్ అసిస్టెంట్ సురేందర్, ఆర్ఐ శ్రీకాంత్. సర్వేర్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, ఆపరేటర్ విజయ్ కుమార్, సత్యనారాయణ, శ్రీనివాస్ ఉంటారని, ఈ బృందం 3వ తేదీన బాచుపల్లి, 4న పెరుగుగూడ, 5న పులిమామిడి, 6న దన్నారం, 9న చిప్పలపల్లి, 10న మురళి నగర్, 11న జైత్వారం ఖాల్సా, 12న జైత్వారం మక్త, 13న కొత్తూరు, 16న గఫూర్‌నగర్,17న అక్బర్జ, 18న అలీ ఖాన్ పల్లి, 19న నేదంనూరు, 20న ముచ్చర్ల, 21న సార్ల రావులపల్లి గ్రామలలో నిర్వహిస్తారని, మరో బృందంలో నాయబ్ తహసీల్దార్ శేఖర్ ఆధ్వర్యంలో ఆర్ఐ యాదగిరి, సర్వేయర్ సాయి కాంత్, భరత్ రెడ్డి, ప్రశాంత్, రఘు ఈనెల 3వ తేదీ దెబ్బడగూడ, 4 వ తేదీ మహమ్మద్ నగర్, 5 అన్నోజిగూడ, 6న తిమ్మాయిపల్లి, 9న పంజగూడ, 10న మీర్ ఖాన్ పేట్, 11న గుమ్మడవెల్లి, 12న మాదాపూర్, 13న తిమ్మాపూర్, 16న రాచులూరు,17న వేమూరు, 18న గూడూరు, 19 దాసర్లపల్లి, 20న కందుకూరు గ్రామాల్లో నిర్వహిస్తామని ఆయన తెలిపారు. సకాలంలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ఐక మత్యంతో ఏదైనా సాధించొచ్చు

కాచిగూడ, జూన్ 1: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపులు ఒకే తాటిపైకి వచ్చి, ఐక్యత చాటాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు, తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్ న్యాయవాది అనుముల జగన్ విజ్ఞప్తి చేశారు. పిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నూతన రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ ప్రమాణ స్వీకారోత్సవం, ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కాచిగూడ మ్యాడం అంజయ్య హాల్లో నిర్వహించారు. రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాసరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు 29 మంది కార్యవర్గ సభ్యులు, 22 మంది నామినేటెడ్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ముఖ్య అతిథులుగా హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ప్రొఫెసర్ ఎం.ఆర్ వెంకట్రావు హాజరయ్యారు.

## ప్రజా పాలనలో.. ఇన్‌చార్జిలే దిక్కు

ఉప్పల్, జూన్ 1: కాంగ్రెస్ ప్రభుత్వం చెప్తు న్న ప్రజా పాలన ప్రజలకు అందడం లేదు. ప్రజల అవసరాల కోసం అందుబాటులో ఉండాల్సిన అధికారులు పూర్తిస్థాయిలో ఉండడం లేదు.

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో పూర్తి స్థాయి అధికారులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

### కీలక పదవులన్నీ ఇన్‌చార్జిలే..

ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో శానిటేషన్ విభాగం డీఈ చందన ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా ఉప్పల్ సర్కి ల్లో ప్రాజెక్టు ఆఫీసర్ ఇన్‌చార్జితోనే కొనసాగిస్తున్నారు. వీటితో పాటుగా టౌన్ ప్లానింగ్ విభాగంలో ఏసీపీగా ఇన్‌చార్జి ఉండగా, టీపీఎస్‌కు మరొక సర్కిల్ కేటాయించారు. దీంతో పలు కీలక విభాగాల్లో ఇన్‌చార్జులు ఉండడంతో ప్రజలకు అందుబాటులో లేక ఇబ్బందిగా మారింది. వీరికి ఈ సర్కిల్‌తో పాటు మరో ప్రాంతంలో కూడా పోస్టింగ్ ఉండడంతో రెండు ప్రాంతాల్లో పనిచేయాల్సి వస్తుంది. ప్రజాపాలనలో ప్రజలకు పాలన అందించాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం గమనార్హం.

## తలనొప్పిగా రేషన్ సరుకుల పంపిణీ

- మూడుసార్లు వేలిముద్రలు వేయడంతో ఒక్కరికీ 20 నిమిషాల సమయం
- ఒకేసారి వేలిముద్రతో సరకులు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

అంబర్ పేట, జూన్ 1 : పౌరసరఫరాల శాఖ అంబర్ పేట సర్కిల్ పరిధిలో అమలు చేస్తున్న మూడు నెలలకు సంబంధించిన రేషన్ బియ్యం పంపిణీ తలనొప్పిగా మారింది. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో, కేంద్రం ఆదేశాల మేరకు జూన్, జులై, ఆగస్టు నెలలకు సంబంధించిన సన్న బియ్యాన్ని అందజేయడానికి పౌరసరఫరాల శాఖ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఇందులో భాగంగా రేషన్ షాపుల ద్వారా ఫోర్టిఫైడ్ రైస్‌తో పాటు పంచదార, గోధుమలు కూడా పంపిణీ చేస్తున్నారు. ఆదివారం నుంచి అంబర్ పేట సర్కిల్ పరిధిలోని అన్ని చౌక ధరల దుకాణాల డీలర్లు లబ్ధిదారులకు వచ్చే మూడు నెలలకు సంబంధించిన బియ్యం పంపిణీ ప్రక్రియను ప్రారంభించారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయనున్నారు. ఇదిలా ఉండగా ఒకే నెలలో మూడు నెలల సరుకులు పంపిణీ చేస్తుండడంతో డీలర్లు ఒక కార్డు దారుడికి సంబంధించి మూడుసార్లు వేలిముద్రలు తీసుకోవాల్సి వస్తుంది. దీంతో డీలర్ ఒక కార్డుదారుడికి రేషన్ ఇవ్వడానికి 20 నిమిషాల సమయం తీసుకుంటుంది.

ఈ పరిస్థితుల్లో సాఫ్ట్ వేర్ సమస్యను పరిష్కరించడంతో పాటు బ్లూటూత్ మిషన్ విషయంలో సడలింపు ఇవ్వాలని, ఒక కుటుంబానికి చెందిన బియ్యం ఒకేసారి పంపిణీ చేసే విధంగా వెసులుబాటు కల్పించాలని డీలర్లు కోరుతున్నారు.

## పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



రాచులూరులో మాట్లాడుతున్న బాల్ రాజ్

కందుకూరు, జూన్ 1 : పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మండల సీఐటీయూ కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ కోరారు. మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రాచులూరు గ్రామంలో కార్మికుల సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామపంచాయతీ వర్కర్లకు మల్టీపర్పస్ విధానం పేరుతో ప్రతి ఒక్క వర్కర్ కు రూ 9,500 వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. కానీ అందులో నుండి రూ, 7 వేలు మాత్రమే అందుతున్నాయని తెలిపారు. మిగతా డబ్బులు మల్టీపర్పస్ లేని ఆరు సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. మండలంలోని చాలా గ్రామపంచాయతీలలో అధికారులు ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నట్లు చెప్పారు. కొంతమంది వీధులు శుభ్రం చేసే స్వీపర్లకు 3,000 రూపాయలు మాత్రమే చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ ఉద్యోగులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరి చేయించుకుంటున్నట్లు వివరించారు.ఉదయం 7 గంటలకు మొదలుకొని సాయంత్రం 6 గంటల వరకు కారోబార్లను వారి వెంబడి పెట్టి ఎండల్లో, వానల్లో పనిచేయస్తున్నారు. కానీ పనికితగిన వేతనం ఇవ్వడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులను ఇవ్వాలని, ప్రతి కార్మికుడికి రూ .26 వేల వేతనం ఇవ్వాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, ప్రమాద బీమా పది లక్షల రూపాయలు ఇవ్వాలని, గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.



ఉచిత కంటి వైద్య శిబిరంలో మందులను పంపిణీ చేస్తున్న కాలనీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి

మన్సూరాబాద్, జూన్ 1: నాగోల్ డివిజన్ పరిధి రాక్ టౌన్ కాలనీలోని కమ్యూనిటీ హాల్ లో ఆదివారం నేత్రాలయ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాలనీ అధ్యక్షుడు వినోద్ రెడ్డి మాట్లాడుతూ, ప్రైవేటు దవాఖానాల యాజమాన్యాలు ముందుకు వచ్చి కాలనీలలో ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సురేష్, మార్కెటింగ్ మేనేజర్ రాము, సాయి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు బహుమతులు ప్రదానం



చిన్నారులకు బహుమతులను అందజేస్తున్న అజీజ్, తదితరులు

సైదాబాద్, జూన్ 1: సైదాబాద్ శంకేశ్వర బజార్‌లోని మసీదు ఇ హనాఫియా సమ్మర్ క్యాంప్ 2025 నిర్వహించారు. సుమారు 40 రోజుల పాటు నిర్వహించారు. వేసవి శిబిరంలో ప్రతిభ కనబరిచిన చిన్నారులకు బహుమతులు ప్రదానం చేశారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దల గౌరవం, నామాజ్ కార్యక్రమం నిర్వహించారు. పిల్లల కార్యక్రమానికి ప్రేరణ కమిటీ మసీదు ఇ హనాఫియా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, సయ్యద్ అయాజ్ జహీర్, కమిటీ సభ్యులు అన్వర్, పాషి, వహీద్ ఉడ్ జమా, బషరత్, షజహర్, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

కీసర, జూన్1: కీసరగుట్ట వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఆదివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేశారు. కీసరగుట్ట కమాన్ వద్ద పోలీసులు 24 గంటల పాటు అక్కడనే ఉండి యాదాద్రి జిల్లా బొమ్మాలరామారం మండలం నుంచి కీసర మీదుగా హైదరాబాద్ నగరానికి వచ్చే వాహనాలను, కీసర నుంచి యాదాద్రి ప్రాంతాలకు వెళ్లే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. రాచకొండ పరిధిలోని కీసర, జవహర్‌నగర్, కుషాయిగూడ తదితర ప్రాంతాలకు చెందిన పోలీసులు షిఫ్ట్‌లో చెక్ పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్నారు.